


ఆదమరచి నిద్రపోయే మనిషిని చూస్తేనాకెంతో ఆనందం. నన్నడిగితే నిద్ర ఒక వరం కలతలకి అతీతంగా వుంచుతుంది. ఆ కాసేపు మనల్ని ఆదుకుంటుంది. చీకూ చింతలేని మనిషి కమ్మగా నిద్రపోతాడని థియరీ. పసిపిల్లలు ఈ థియరీకి చక్కటి ఉదాహరణలు. ఉక్కా ఉంగా అనే స్థితిలో ఈ ప్రపంచం గురించి వాళ్ళకేం తెలుస్తుంది చెప్పండి. ఇక్కడి సౌఖ్యాలూ, ఇక్కడి పథకాలూ, టెన్షనూ, ఏదో విధంగా బతికేయాలనే తపన, అందుకోసం సవాలక్ష మార్గాలూ....ఇవేమీ ఆ చిన్న మనసుకి తెలీవు గనుక ఆకలేస్తే పాలకోసం ఏడుస్తారు. పాలు పట్టించగానే వేలు నోట్లో పెట్టుకుని కమ్మగా బజ్జుంటారు.

వ్యాపకా లెక్కువయ్యే కొద్దీ నిద్ర తగ్గుతుంది. ధనవంతులూ, పెద్ద పెద్ద వ్యాపారస్థులూ, నాయకులూ, ఎంతో పెద్ద అధికారులూ, వగైరా జాతి మనుష్యులకు నిద్ర తక్కువని ఖచ్చితంగా చెప్పవచ్చు. హోదా పెరిగే కొద్దీ బాధ్యతా, బరువూ పెరుగుతుంది. దాంతో ఆటో మేటిగ్గా నిద్ర తగ్గుతుంది. నిద్రపట్టని మనిషి ఎంత గొప్పవాడైనా ఆ కష్టం ఎంత గొప్పదో వాళ్ళనడిగి తెలుసుకోండి. జాలిపడే వంతు మీదవుతుంది. నిద్రమాత్రలు విరివిగా ఖర్చవుతున్నాయంటే ఆమార్కెట్‌ని వీళ్ళే పెంచేరు. మాత్ర లేకపోతే ఆ రాత్రికి జాగారమే. మన నిద్ర మనం తెచ్చుకొనేందుకు కూడా మాత్ర కావల్సివచ్చిందంటే ఆ జీవి ఎంత దురదృష్టవంతుడో సుళువుగా అర్థమవుతుంది. మెదళ్ళో సమస్యలు దోమల్లాగా తిరుగుతూ చిటుకు చిటుకుమని కుడుతూ వుంటే ఇంక నిద్రెక్కడ? ఆ సుఖం ఎక్కడ? అదే కూలీ బ్రదర్ని తీసుకోండి. ఏ రోజు బతుకు ఆ రోజుదే. రెక్కల కష్టమే ఆస్థి అన్నీను. శుభ్రంగా ఒళ్ళొంచి కాయికష్టం చేస్తాడు. బాగా గిట్టుబాటయితే కొంచెం పుచ్చుకుంటాడు. తృప్తిగా తింటాడు. ఆరు బయట వెల్లికిలా పడుకుంటాడు. సినీమాలో బూతు పాట గుర్తున్నంత వరకూ పాడుకుంటాడు. పాట పూర్తవగానే గురక ప్రారంభమవుతుంది. మళ్ళా సూర్యభగవానుడో, కోడికూతో అతనికి సుప్రభాతం పాడవలసిందే. ఈలోగా అతని నిద్రని పాడుచేసే హక్కు ఈ భూలోకంలో ఎవరికి లేదు, వుండదు.

చాలా కాంప్లికేటెడ్ జాతి మధ్యతరగతి. నిద్ర పట్టడం, పట్టక పోవడమనేదంతా ఒక సీజన్లాగా గడుస్తుంది. టూకీగా అమ్మాయి పెళ్ళి ఒక సీజననుకుందాం. ఆ పిల్లకి పెళ్ళయి, అత్తారింటికి వెళ్ళేంతవరకు కన్న తల్లి దండ్రులకు నిద్రుండదు. వెళ్ళిపోయిన తర్వాత సుఖంగా నిద్రపోతారు. అత్తారింట్లో అమ్మాయి అవస్థ పడుతోందని తెలిస్తే మళ్ళా నిద్ర బందు. సెటిలైందని వింటే కంటినిండా నిద్ర. అట్లాగే అబ్బాయి చదువు, వాడి పరీక్షలు, ఉద్యోగం. ఈ విధంగా బ్రతికినంతకాలమూ కొన్ని నిద్రలేని రాత్రిళ్ళు ఎదురైతే, మరికొన్ని నిద్ర ముంచుకొచ్చే రాత్రిళ్ళు ఈ జాతికి సొంత మవుతాయి.

ప్రేమలోపడ్డ వాళ్ళకి సాధారణంగా నిద్ర ఉండవు. నిద్ర వచ్చినా అది కలత నిద్రో, సగం నిద్రో అవుతుంది. ఆ నిద్రలోకూడా ప్రేమ గొడవే చేరిపోయి తికమక పెడుతుంది. దీన్ని సింపులుగా మనం విరహం అని పిలుస్తుంటాం. విరహం నిద్రకి బద్ధ విరోధి. పైగా నిప్పులాటిది. నిలువెల్లా సెగలు పుట్టిస్తుంది. ఈ స్థితిలో నిద్రెట్లా పడుతుంది? వెన్నెల విరగ బూసింది కదాని డాబామీద పరుపు వేసుకుని పడుకుంటే చెవి దగ్గర ప్రియా, ప్రియాని ఒకటే సోది. మనిషుండదు గానీ మాట మాత్రం ప్రాణాలు తీస్తుంది. అమావాస్యనాడైనా హాయిగా నిద్రపోదామంటే వీలవదు. చీకట్లో చూడాలి నా ఎంకి అందాలు అంటూ ఏవేవో జ్ఞాపకా లొచ్చేసి నిద్రని నెట్టేస్తాయి.

ఆఫీసులలో నిద్రపోయే వాళ్ళని మనం క్షమించాలి. ఇంటి దగ్గర ఆపాటి సౌకర్యాలు లేకనో, ఇల్లాలి పోరో ఒక కారణంవల్ల నిద్ర పట్టదు. ఆ బాదరబందీ వుండదు. ఎంచక్కా ఫేను గట్రా ఉంటాయి. తల వాల్చుకో డానికి మెత్తని పైళ్ళుంటాయి. అక్కడ నిశ్శబ్దమే కాకుండా పైపు మిషను రొద (దేవుడు దయతలిస్తే టైపిస్టుకు రాకూడదు నిద్ర) కర్ణపేయంగా వుంటుంది. రిజిష్టరు తెరవగానే మొదట ఆవులింత లొస్తాయి. మెదడు మొద్దుబారుతుంది. ఎవడో తాడేసి నిద్రా లోకంలోకి లాక్కుపోతున్నట్టు ఫీలింగు కలుగుతుంది. ప్రాణం అలా తేలిపోయి కళ్ళు మూతలు పడతాయి.

కాలేజీలలో తెలుగు పిరియడు నిద్రకి కేటాయిస్తారు. పద్యమో, వచనమో కమ్మగా చదువుతుంటే, జోలపాడి నట్టవుతుంది. నిద్రా దేవత వయ్యారంగా వచ్చేసి హల్లో! అంటుంది. ఆ మాటకొస్తే క్లాసు పుస్తకాలు ఏమి చదివినా తన్నుకొచ్చేది నిద్రా దేవత. డిగ్రీ పుచ్చుకొని ఎన్నేళ్ళయినా నిద్ర రాకపోతే ఎకనమిక్స్ తీసుకుంటాడు మా వీరభద్రరావు. క్లాసు పుస్తకాలతో అతని అనుబంధం ఎంత గొప్పదో తమరు గుర్తించాలి. ఆఫీసుల్లోనూ కాలేజీలలోనూ నిద్రపోతే అర్థముంది. అసెంబ్లీలో కూడా నిద్రపోయే మహానుభావు ల్నేమనాలి? ఏమీ అనద్దు. దండం పెట్టేసి తప్పుకోండి చాలు.

సిటీ బస్సులో తొడ తొక్కిడి రద్దీలో సైతం సీటు దొరికిన ఆసామి కునుకు తీస్తున్నప్పుడు సదరు ఆ మనిషిమీద నాకు గొప్ప గౌరవం కలుగుతుంది. బస్సు ఎక్కగానే దాన్నొక ఉయ్యాలగా భావించే సహృదయుడు ఎంత అదృష్టవంతుడో గదా! నా మాటకొస్తే నేను కూడా నిద్రాభిమానినే. నిద్రొచ్చేముందు నాకు తెలుస్తుంది. టైమ్ ఫర్ స్లీప్ అని నెుదట్లో గంట మోగుతుంది. దేవుడొచ్చేది నేను పట్టించుకోను. మంచం వుండి, పరుపు లేకపోయినా, పరుపుండి మంచం కరువైనా ఈ రెండూకూడా సమయానికి సిద్ధం గాకపోయినా అయ్ డోంట్ కేర్. కటిక నేల చాలు! అదే నాకు హంస తూలికా తల్పం. విజయనగరం రైల్వే ప్లాటుఫారమూ, ఒంగోలు బస్‌స్టాండూ నాకీ అనుభవాన్ని అందించేయి. ఆ నిద్రలో కూడా ఎంతో సుఖం వున్నట్టు నేను గమనించేను. పగలు, విశ్రాంతిలేని కార్యక్రమాలలో నిండా మునిగిపోయి, రాత్రి రైలు కోసమో. బస్సు కోసమో వెయిటింగో వస్థలో వున్నప్పుడు కళ్ళమీద కొచ్చే నిద్ర గొప్ప నిద్ర. అంత సౌఖ్యం కలకత్తా, మదరాసుల్లాంటి మహా నగరాలల్లో ఖరీదైన హోటల్ తాలూకు ఎ. సి. గదులుకూడా ఇవ్వవని అనుభవ పూర్వకంగా చెబుతున్నాను. ఇందు మూలకంగా నిద్ర హోదాలు పట్టించుకోదని నా కర్థమై పోయిందది.